లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం

● ఘనంగా కార్మిక దినోత్సవం

ఆత్మకూరు: లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, సీనియర్ నాయకులు ఇస్మాయిల్ అన్నారు. గురువారం మే డేను పురస్కరించుకుని స్థానిక కార్యాలయం వద్ద కార్మిక జెండాను ఎగుర వేశారు. సీపీఐ కార్యాలయం నుంచి బస్టాండు మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాల రాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా, పట్టణ నాయకులు చాంద్ బాషా, లల్లు, బిసన్న, అత్తావుల్లా, అహ్మద్‌హుసేన్, ఓబులేష్, నగన్న, మహిళా సమాఖ్య నాయకులు మూర్తుజాబీ, జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షులు యేసేపు, రావూఫ్, పుల్లయ్య, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

- మే డే సందర్భంగా ఆటో, హమాలీ యూనియన్ కార్యాలయాల వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయం నుంచి బస్టాండు, గౌడ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయులు పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు

- **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలంప్రాజెక్ట్ పురవీధుల్లో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద, కా.టి.జనార్దన రావు విగ్రహం వద్ద, స్వామిరెడ్డి భవనంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు కె.నాగిరెడ్డి, డి.ఓబులయ్య, పి.పులిరాజు, ఎస్.కె.బాబు, టి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.
- **మహానంది:** గాజులపల్లె, బుక్కాపురం గ్రామాల్లో గురువారం మే డే సందర్భంగా ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు సామేలు, కోటకొండ బాషా, వాల్మీకి మహర్షి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల పల్లె జయరాం తదితరులు పాల్గొన్నారు.
- **వెలుగోడు:** పట్టణంలోని పలు చోట్ల మే డే ఉత్సవాలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక జెండాలు ఆవిష్కరించి సంబరాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, సీపీఎం వెలుగోడు శాఖ కార్యదర్శి మహమ్మద్ రఫీ, సీఐటీయూ మండల అధ్యక్షులు వి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.
- **బండిఆత్మకూరు:** పార్నపల్లె, ఏ.కోడూరు తదితర గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. నాయకులు రాజు, ఆనందమ్మ, సువర్ణమ్మ, రామచంద్రుడు పాల్గొన్నారు.


శ్రీశైలంప్రాజెక్ట్‌లో ర్యాలీ చేస్తున్న కార్మికులు

- **కొత్తపల్లి:** మండలకేంద్రంతోపాటు సింగరాజు పల్లి, శివపురం గ్రామాల్లో కార్మిక జెండాలను నాయకులు ఆవిష్కరించారు. కార్మికుల శ్రమను పెట్టుబడి దారులకు దోచి పెట్టడానికి తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకుల హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి స్వాములు, సీఐటీయూ నాయకుడు పి.శేఖర్, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు హరిత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు దినేష్ సూచించారు.
- **పగిడ్యాల:** మండలంలోని నెహ్రూ నగర్‌లో గురువారం సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎల్లంబావి వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు.
- **జూపాడుబంగ్లా:** మండల కేంద్రంలో మే డే ఉత్సవాలను కార్మికులు ఘనంగా నిర్వహిచుకున్నారు. కార్మిక జెండాలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, సీపీఎం పార్టీ మండల కన్వీనర్ కర్ణ తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరులోని పటేల్ సెంటర్‌లో జెండాను ఎగరవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

- **నందికొట్కూరు:** పట్టణంలోని సీపీఐ ఎంఎల్, ఏఐసీసీటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, వామపక్షాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాల, కమ్యూనిస్టు పార్టీల నాయకులు వెంకటేశ్వర్లు, రఘురాంమూర్తి, నరసింహులు, లాజరస్, నాగేశ్వరరావు తదితరులు కార్మిక జెండాను ఎగురవేశారు. ప్రధాన రహదారులపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం జైకిసాన్ పార్కులో పాత్రికేయులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపాలిటీ ఆర్వో మధుసూదన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: ఉమ్మడి కర్నూలు జిల్లాలో పదో తరగతి, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కురువ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పాపారాయుడు గురువారంతెలిపారు. మార్కుల మెమో, కులధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలను ఈనెల 5లోపు 9440756199, 9032741194 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు.

శుభకార్యం

మహానంది: అల్లినగరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత యలమంద కుమారుడి వివాహానికి గురువారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర రెడ్డి, నాయకులు కొండా మధుసూదన్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు


సిద్దపల్లిలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీఐ రాము, పోలీసులు

ఆత్మకూరు: అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ రాము హెచ్చరించారు. మండలంలోని సిద్ధపల్లి గ్రామంలో గురువారం రాత్రి సీఐ రాము పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. ఎవరైనా రౌడీషీటర్లు ఉంటే సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, అల్లరు, గొడవలకు పాల్పడినా వదిలే ప్రసక్తే లేదన్నారు. అనంతరం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తదితరులు

ఆత్మకూరు: స్థానిక కేవీకే స్టేడియంలో 30 రోజుల వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది క్రీడాప్రాంగణానికి ఏడు క్రీడలు మంజూరయ్యాయన్నారు. విద్యార్థులు వేసవిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షకులు జునైద్‌బాషా, మహబూబ్, హరియాదవ్, సతీష్, ఖాజాహుసేన్, ఉపేంద్ర, సరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఓకు ఎంపీడీఓగా పదోన్నతి

జూపాడుబంగ్లా: స్థానిక మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ నూర్జహాన్ ఎంపీడీఓగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన ఆమెను మంత్రాలయం ఎంపీడీఓగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈమె స్థానంలో మధుసూదనయ్యను ఏఓగా నియమించారు. కాగా స్థానిక కార్యాలయంలో టైపిస్టు, జూనియర్ అసిస్టెంటు, అటెండర్ స్థానాలు ఖాళీగా ఉండటంతో ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరిగింది. ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్తవారిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉదయమే పనికి వెళ్లండి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పాములపాడు: ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉపాధి కూలీలు ఉదయం త్వరగా పనులకు వెళ్లి పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం చిలిముల గ్రామ పరిధిలోని ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ప్రతిఒక్కరూ తలకు టవలు చుట్టుకోవాలని, నీటిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. అంతకుముందు మస్టర్ రోల్ పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఆయన వెంట ఏపీఓ అలివేలు మంగమ్మ ఉన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. గురువారం నీలిషికారి పేటలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేశారు. నాటుసారా విక్రయిస్తున్న రమ్యను అరెస్టు చేసి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు కృపవరకుమారి, శంకర్ నాయక్, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

అవసరమైన మేరకే ఎరువులు వాడాలి

మహానంది: మట్టి నమూనా సేకరణ ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వాడితే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డితో కలిసి గురువారం మసీదుపురం గ్రామంలో మట్టి నమూనాల సేకరణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఓ రాజశేఖర్ మాట్లాడుతూ సరైన పద్ధతులు పాటించి మట్టి నమునాలు తీయాల్సి ఉంటుందని, తీసిన మట్టి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించాలన్నారు. సాగు చేసే పంటలు, పంటల రకాల వేరు వ్యవస్థ వెళ్లే లోతును బట్టి 15 నుంచి 30 సెంటీమీటర్ల లోతులో వి ఆకారంలో గుంతను తీసి మట్టినమూనా సేకరించాలని గ్రామ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మట్టి నమూనా ఫలితాలను బట్టి ఎరువులు వాడితే రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయన్నారు. పోషకాల స్థాయిని బట్టి అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగిస్తే మంచి దిగుబడులు ఉంటాయన్నారు.


మట్టినమూనాలు తీస్తున్న దృశ్యం

మద్యం బాబుల హల్‌చల్

● రోడ్లపైనే సీసాలను పగలగొడుతున్న వైనం

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని వైన్‌షాపు వద్ద మద్యంబాబులు హల్‌చల్ చేస్తున్నారు. షాపు వద్ద బండలు వేసి చిన్న పాటి షెడ్డును వేయడంతో మద్యంబాబులు అక్కడే మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. కొందరు మద్యం మత్తులో పక్కనే ఉన్న ప్రధాన రింగ్ రోడ్డు మీదికి వచ్చి బీరుసీసాలను పగలగొడుతుండటంతో కాలినడకన వెళ్లే వారికి గాజు పెంకులు గుచ్చుకుని గాయాలవుతున్నాయి. వైన్ షాపు పక్కనే నివాసాలు ఉండటంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుపైనే బీర్ బాటిల్ పగలగొట్టిన దృశ్యం

అనుమతులున్న ఎరువులనే విక్రయించాలి


మాట్లాడుతున్న ఏడీ అంజనేయ


వెలుగోడు: అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలనే విక్రయించాలని ఏడీ ఆంజనేయ డీలర్లకు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో మండల అధీకృత డీలర్లకు విత్తన, పురుగు మందుల, ఎరువుల నియంత్రణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చే రసీదులో సరుకు వివరాలు పూర్తి సమాచారంతో ఉండాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నకిలీ లేదా లూజ్ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఉయ్యాలవాడ : పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పేకాడుతున్నారనే సమాచారం మేరకు పుచ్చకాయలపల్లె, సంజామల మండలంలోని అక్కంపల్లె గ్రామానికి చెందిన వారు ముళ్ల పొదల్లో పేకాట ఆడుతుండడంతో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

కారుణ్య నియామకాల్లో నిబంధనలు పాటించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కారుణ్య నియామకాల కింద ఏ విభాగం వారు అదే విభాగంలో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలస్వామి నాయక్ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం డీఎంహెచ్ఓ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం కింద అక్కడే ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్కడ ఖాళీ పోస్టులు లేకపోతే జిల్లా కలెక్టర్ దరఖాస్తును పరిశీలించి ఖాళీ ఉన్న విభాగంలో నియమిస్తారన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా నేరుగా నియామకాలు చేపడుతున్నారని, తద్వారా విద్యార్హత ఉన్నా ఎంతోమంది పదోన్నతి పొందకుండా అన్యాయానికి గురవుతున్నారని వివరించారు. దీన్ని వెంటనే సరిచేయాలని కోరారు. యూనియన్ సెక్రటరీ ఎస్.ఖాజామొహిద్దీన్, ట్రెజరర్ సురేష్ ఉన్నారు.


సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఈదురుగాలులతో రైతన్నల ఆందోళన

మహానంది: మహానంది మండలంలో గురువారం సాయంత్రం భారీ గాలులు రావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం 4 గంటల నుంచి సుమారు రెండు గంటల పాటు ఏకధాటిగా గాలి వీయడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గాజులపల్లెలో కొద్ది పాటి వర్షం కురిసింది. అబ్బీపురం ఫీడర్‌లో బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ స్తంభం వద్ద మంటలు ఎగిసిపడ్డాయి. సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు.


అబ్బీపురం వద్ద ఈదురు గాలులు వీస్తున్న దృశ్యం

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

వెలుగోడు: 2025–26 సంవత్సరం వార్షిక ప్రణాళికలో స్వయం ఉపాధి పథకాలకు ఈనెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీ

జూపాడుబంగ్లా: మే మాసానికి గానూ మండలానికి 4,902 పింఛన్లు మంజూరు కాగా గత నెలకంటే 8 పింఛన్లు తగ్గాయి. గురువారం ఉదయం 7గంటల నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాగా మధ్యాహ్నానికి 4,553 మందికి(92.88శాతం) పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపికృష్ణ తెలిపారు. మిగిలిన 349 పింఛన్లు శుక్రవారం సాయంత్రంలోగా పంపిణీ చేస్తామన్నారు.

సర్వసభ్య సమావేశానికి హాజరుకండి

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 9న నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు హాజరు కానున్న సమావేశానికి ప్రగతి నివేదికలతో రావాలని అధికారులకు సూచించారు.


నూతనంగా నిర్మించిన ఆలయం

విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆత్మకూరురూరల్: మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో గురువారం భూదేవి సహిత చెన్నకేశవ, సీతారామాంజనేయ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయమే గురుప్రాసద, గోపూజ, ఘనపతి పూజ, పుణ్యాహావచనం, నాందీ, ఆరాధన, కంకనధారణ, రుత్విగ్వరుణం, పంచగవ్య, యాగశాలశుద్ధి, ఆలయశుద్ధి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పునఃపూజ, దీక్షాహోమం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జలాధివాసం, హారతి, తదితర కార్యక్రమాలు చేపట్టారు. శుక్ర, శనివారాలు కూడా హోమాలు, ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


ప్రతిష్ఠా కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన యాగశాల

ఆటాడుకుందాం రా..!

- జిల్లాలో ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- నెల పాటు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఒక్కో శిబిరానికి రూ.7వేలు కేటాయించిన శాప్
- 50 శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ

నంద్యాల(న్యూటౌన్): వేసవి వచ్చిందంటే చాలు పిల్లలకు ఆటలు గుర్తుకొస్తాయి. ఏడాదంతా పుస్తకాలు, ప్రాజెక్టులు, పరీక్షలు అంటూ ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత సేదతీరుతుంటారు. వేసవి సెలవుల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో గడపడాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంటారు.

కొందరు చిన్నారులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోతున్నారు. వారి దృష్టిని మళ్లించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శాప్ ఆధ్వర్యంలో ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని 50 నిర్ణీత ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారు. ఇందు కోసం ఒక్కో శిబిరానికి రూ.7 వేలు చొప్పున కేటాయించారు. ఈ మొత్తంలో శిక్షకుడికి రూ.2వేలు ఇవ్వనుండగా.. మిగిలిన రూ.5 వేలతో క్రీడా సామగ్రి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు.

నెల పాటు నిర్వహణ

జిల్లాలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వేలాదిగా ఉన్నారు. వారిలో ఔత్సాహికులైన బాల బాలికలకు నెల పాటు పలు ఆటల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయించింది.

ఇందు కోసం శిక్షకులను ఎంపిక చేసింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండే విద్యార్థులు వారికి ఇష్టమైన ఆటలు ఆడి నెల రోజుల పాటు నైపుణ్యం సాధించవచ్చు.


ఫుట్‌బాల్ శిక్షణ శిబిరంలో విద్యార్థులు


స్టేడియంలో తైక్వాండో శిక్షణ

వివిధ అంశాల్లో తర్ఫీదు

ఓ వైపు చదువుతో పాటు మరో వైపు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఏడాది వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా 16 ఏళ్లలోపు బాల, బాలికలకు అవకాశం కల్పిస్తారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్ బాల్, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

యాప్‌లో వివరాల నమోదు

శిబిరాలు పారదర్శకంగా జరగాలనే ఉద్దేశంతో శాప్ ప్రత్యేకంగా క్రీడా యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని ఇప్పటికే అధికారులకు సూచించారు. శిబిరాలు పెట్టే ప్రదేశం, క్రీడాంశం, విద్యార్థులు, శిక్షకుల వివరాలు, గౌరవ వేతనం, ఉపకరణాల పంపిణీ, ప్రశంసా పత్రాల అందజేత తదితర వివరాలను కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఆ వివరాలు కూడా పొందుపరచవచ్చు.

క్రీడా పేరు	శిక్షణా శిబిరాలు
ఆర్చరీ	నంద్యాల
అథ్లెటిక్స్	నందికొట్కూరు
బ్యాడ్మింటన్	ఆళ్లగడ్డ
బాల్ బ్యాడ్మింటన్	ఆత్మకూరు
బాల్ బ్యాడ్మింటన్	పెద్ద చింతకుంట్ల
బాల్ బ్యాడ్మింటన్	పేరాయిపల్లి
బాల్ బ్యాడ్మింటన్	అహోబిలం
బాక్సింగ్	బనగానపల్లె, ఆత్మకూరు, నంద్యాల
చెస్	నంద్యాల
ఫుట్‌బాల్	నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు
హ్యాండ్ బాల్	ఆళ్లగడ్డ, దొర్నిపాడు, సంజామల
కబడ్డీ	నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ
ఖోఖో	ఆత్మకూరు
సెపక్‌తక్రా	ఆళ్లగడ్డ
సాఫ్ట్‌బాల్	ఆళ్లగడ్డ, నంద్యాల, సంజామల
తైక్వాండో	నంద్యాల, ఆత్మకూరు, చాబోలు, ఆళ్లగడ్డ
వాలీబాల్	బనగానపల్లె, ఆత్మకూరు, నున్నిపెంట, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ
యోగా	కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, నంద్యాల

50 శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు




స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లా మొత్తంగా 50 శిబిరాలు ఏర్పాటు చేశాం. ఈ మేరకు క్రీడాసంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఒక్కో శిబిరానికి రూ.7వేలు మంజూరైంది.

–రాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, నంద్యాల

నీటి తొట్లను పరిశీలించిన ఎంపీడీఓ

సాక్షి ఎఫెక్ట్


నీటి తొట్టిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

పగిడ్యాల: 'నత్త నడకన నీటి తొట్ల నిర్మాణం' శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ సుమిత్రమ్మ స్పందించారు. గురువారం ఆంజనేయనగర్ గ్రామ శివారులోని పశువుల నీటి తొట్టిని పరిశీలించారు. ఏఏ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్నాయో తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీఓ మద్దిలేటిని ఆదేశించారు. తొట్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతోపాటు కనీసం 21 రోజులు క్యూరింగ్ చేసేలా చూడాలని సూచించారు. అసంపూర్తిగా ప్లాట్ ఫాంలకే పరిమితమైన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. అనంతరం పగిడ్యాల నేలగండి సమీపాన జరిగే ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు.